# 3

# దాసులైన ఉపదేశకులు

## (1 థెస్సలొనీకయులకు 2:1-12)

గతకాలమందు చేసిన క్రియలను మరియు సంబంధబాంధవ్యాలను మనము మరచిపోదుము లేదా వాటినుండి మనము ఎంతో కొంత నేర్చుకొనియుందుము. క్రొత్త నిబంధన పత్రిక అయిన థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక నేర్చుకొనదగిన అనేక అంశాలను కలిగియుంది. 2వ అధ్యాయము యొక్క మొదటి సగభాగము పౌలు, సిల్వాను మరియు తిమోతియులను దర్శించుటపై కేంద్రీకృతమైయున్నది. వారు కలిసి యుండినప్పుడు వారి మధ్య అభివృద్ధిచెందిన సంబంధ బాంధవ్యాలనుండి ఏమి నేర్చుకొనవచ్చునో థెస్సలొనీకయులకు జ్ఞాపకము చేయుటకు పౌలు ఎంతో ఆతృత కలిగినవాడైయున్నాడు. ప్రతి క్రైస్తవుడు శుభవార్తను యితరులకు చూపవలసినవాడైయుండి అలాగుననే చెప్పవలసినవాడైయున్నాడని ఈ నూతన క్రైస్తవులు నేర్చుకొనులాగున ఉపదేశకుల యొక్క స్వభావము మొదట ప్రతికూలముగాను (2:3-6) అటు తరువాత అనుకూలముగాను (2:7-11) వివరించబడింది.

2:1-12లో రచయిత డంబములు చెప్పుకొనినట్టుగా కనిపించుచున్నది; కానీ కొంచెము సమీపముగా పరిశీలించినట్టయితే వారి సంబంధ బాంధవ్యాలను, వైఖరిని, మరియు ఉద్దేశములను పరిశీలించుటయే ఈ వాక్యభాగము యొక్క ఉద్దేశమని చూపబడింది. ఎందుకు? ఎందుకనగా ఎదుగుటకై ఈ నూతన క్రైస్తవులకు ప్రోత్సాహమును మరియు ప్రేరణను ఇచ్చుటకు ఈ వాక్యభాగము మన ఉద్దేశములను, వైఖరిని మరియు సంబంధాలను పరీక్షించుకొనుటకును మరియు మెరుగుపరచుకొనుటకును మనకు సహకరించును.

ఈ భాగములో గల ఒక ప్రధాన ఆలోచనయేమనగా పరిణితి చెందిన పనివారికిని మరియు నూతన క్రైస్తవుల మధ్య వికసించిన సన్నిహితమైన సహవాసము. ఈ సంబంధములు కుటుంబ వ్యవస్థలోగల బలమైన బంధాలను పోలియున్నాయి. ఈ సంబంధము యొక్క స్వభావమును మరియు ఆత్మను పట్టుకొనినట్టయితే అది మనము ఎదుగుటకును మరియు పరిణితి చెందుటకును సహాయపడును.

### దేవునిని సేవించుటయనేది మన లక్ష్యం (2:1-3)

యితరులతోగల సహవాసమును ఫలభరితము చేయునదేది? మొదట్లో ఈ సువార్తికులు థెస్సలొనీకయకు వచ్చినప్పుడు, కఠినమైన పరిస్థితుల మధ్య వారు అక్కడకు వచ్చిరి; కానీ వారి రాకడ గొప్ప ఆశీర్వాదముగా నిరూపించబడినది (2:1). వారి ప్రవేశము "వ్యర్థము" కాలేదు లేదా "నిరర్థకమైనది" కాదు. మనము ఒక క్రొత్త పట్టణానిక వెళ్ళినప్పుడు ఆశీర్వదించడానికి అవకాశాలకొరకు చూస్తామా? తరచూ మన ఆలోచనలేమైయుంటాయంటే, "యిక్కడ ఉందాము," "దీనిని తేలికగా తీసుకుందాము," "మనము నిలబడదాము." బహుశ "మనము ప్రయోజకులమగుటకు కొంత సమయం పడుతుంది"; లేక "... మొదట మనము ఈ

సహోదరులను ఎరుగవలసియుంది"; లేదా "ఏ విధముగా మనమిక్కడ పనిచేయగలమో కనుగొనాలి" అని అనుకుంటాము.

ఈ నూతన ప్రదేశాన్ని "(కాబట్టి మనకు సమయము దొరికిన కొలది) అందరి యెడల విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారియెడలను మేలు చేయుటకు" (గలతీయులకు 6:10) ఒక గొప్ప అవకాశముగా పరిగణించునట్లు 1వ వచనము మనలను ప్రోత్సహించుచున్నది. అనుకూలముగా, చిరునవ్వుతో, గొప్పదైన మాట్లాడు విధానముతో మరియు సహాయ క్రియల ద్వారా మన ప్రభావమును నిరంతరము ఉండునట్టుగా చేయవచ్చు. మన మొదటి పాఠములో జ్ఞాపకము చేసిన, జ్ఞాపకం చేయబడిన ప్రోత్సాహకరమైన మాటలు చెప్పుట, కృతజ్ఞతాపూర్వకమైన ప్రార్థనలు మరియు మాటలు పలుకుట, ప్రజలకు వారి విలువను జ్ఞాపకం చేయుట మొదలగు క్రియలను గుర్తుంచుకొనండి. మేము దేవుని సేవించుటయనే లక్ష్యమును - ఎరిగినట్లైతే, పరిస్థితులు ఏవైనప్పటికి మీ ప్రవేశము ఎన్నటికిని "వ్యర్థము" కాదు.

మనముందున్న అవకాశములను ఉపయోగించుకొనలేక పోవుటకైన కారణములు మనకు ఎల్లప్పుడు తెలియును. ఓడిపోతామనే భయము మరియు విఫలమవుతామన్న భయము అలాగే ప్రత్యర్థుల ప్రతిఘటనను గూర్చిన భయము మొదలగునవి తరచూ మనము చేయగలిగినదానిని చేయకుండునట్లు అడ్డుపడుతుంటాయి. 2వ వచనము 1వ వచనము యొక్క పరిస్థితులను వివరించుచున్నది. ఉపదేశకులు ఫిలిప్పీలో, "శ్రమపడి అవమానముపొందిరి." ఈ అవమానములో బంధించబడుట, న్యాయాధిపతుల ముందుకు ఈడ్వబడుట, కొరడాలతో కొట్టబడుట, మరియు చెరసాలలో బంధించుట మొదలగువాటిని అపొస్తలుల కార్యములు 16:19-23 మనకు బయలుపరుచుచున్నది.

నేడు మనము వారు అవమానము పొందిన విధానాలలో ఒకటైనను పొందినట్టయితే మనము ఎక్కువ సానుభూతిని, నష్టపరిహారమును మరియు విశ్రాంతిని తీసుకొనుటకును తిరిగి ఆరోగ్యమును పొందుటకు కనీసము రెండు వారముల సెలవునైనా కోరుకుంటాము. అటువంటి పరిస్థితులలో ప్రజలు ఒకవేళ తమ దైవభక్తిని విడచిపెట్టుటను కూడ అర్థము చేసుకొనగలము.

ఈ సువార్తికులు, ఫిలిప్పీనుండి అంఫిపోలి, అపొల్లోనియలగుండా థెస్సలొనీకకు ప్రయాణము చేసినవారైయుండి, సమాజ మందిరములలో వాక్యమును ప్రకటించుట ప్రారంభించిరి (అపొస్తలుల కార్యములు 17:1-3). అక్కడ వారికి లభించిన ఫలితమేమనగా, వ్యతిరేకత - "ఎక్కువ వ్యతిరేకత" - అయినప్పటికి వారు వాక్యమును ప్రకటించుచునే యుండిరి! దానికి అభ్యంతరపరచు ప్రత్యర్థులను సంభాళించుటను దాటి వారి సమస్యలు యింకా ముందుకు వెళ్ళినాయి. "అవమానం," "ఎక్కువ వ్యతిరేకత" అని తర్జుమా చేయబడిన పదాలు దూషించుట, పోరాడుట, విరోధము కలిగియుండుట మరియు దుఃఖమువంటి ఆలోచనలను తెలుపుచున్నవి! థెస్సలొనీకయలోని క్రైస్తవులను హింసించుచున్నవారు కొంతమంది వారిని నష్టపరచుటకు నిశ్చయించుకొనిరి, అనగా వారు థెస్సలొనీకయుల యొక్క ఉపదేశకులను వెంటబడి 60 మైళ్ళవరకు (అనగా వందకిలో మీటర్లు) తరిమి చివరికి బెరయలో కూడ సమస్యను లేవనెత్తిరి! (అపొస్తలుల కార్యములు 17:13 చూడు.)

దేవుడు వారి పక్షమునయున్నాడని వారికి తెలుసు కనుక పౌలు, సిల్వాను మరియు

తిమోతియు సువార్తను ప్రకటించుట కొనసాగించిరి. అదేవిధమైన పరిస్థితులలో ఉన్న యెరూషలేములో ఉన్న సంఘము వారి ప్రత్యర్థుల వలనైన బెదిరింపులను గూర్చి మెలుకువగా యుండుటకు, సువార్త ప్రకటించుట కొనసాగించునట్లు అపొస్తలలకు “బహు ధైర్యమును” యిమ్మని వారు దేవునికి ప్రార్థించిరి (అపొస్తలుల కార్యములు 4:29).

ఇబ్బందికరమైన పరిస్థితులలో మనము భంగపాటుకు గురియగుదుము మరియు నిరుత్సాహపడుదుము. కొన్నిసార్లు మనము విడిచి పెట్టుదాం అని అనుకుంటాము. ఈ సవాళ్ళను మనము దేవుడాసించిన ప్రకారము జీవించుటకు అదనపు అవకాశములుగా చూడాలని దేవుడు కోరుకొనుచున్నాడు. దేవునిని మహిమపరచుటకు మంచి మాదిరిలను చూపించుటకు మరియు అదే విధానములో శ్రమపడుచున్న యితరులను ప్రోత్సహించుటకు అవి మనకు లభించిన అదనపు అవకాశములు.

దురుద్దేశముతో మేలు చేయుట సాధ్యమైనదే, కానీ దేవుడు సమస్త దృశ్యాన్ని చూస్తున్నాడు. మన హృదయాలు చెడ్డవైనట్లైయితే, మన క్రియలు కూడ కపటమైనవిగాయుండును. మన ఉద్దేశములను పరీక్షించుకొనుట మరియు మన మంచి ఉద్దేశమును గూర్చి ప్రజలకు తెలియజేయుటయనేది మనకు మంచిది. ఈ సువార్తికులు వారి ఉద్దేశములు నిజాయితిగలవని మరియు నిష్కపటమైనవని స్పష్టపరుచుచున్నారు (2:3). వారు మంచి మెప్పుకోలు యొక్క విలువను ఎరిగినవారై యున్నారు, ఎందుకనగా ఒక బోధకుని జీవితములో “అసత్యము,” “కల్మషము” మరియు “మోసము” మొదలగువాటి ద్వారా జరుగు నష్టమును వారు గ్రహించారు కాబట్టి దానికి బదులుగా దైవభక్తిగల జీవిత మాదిరి యొక్క విలువను కూడ వారు ఎరుగుదురు.

దేవుడు దైవభక్తి కలిగిన క్రియలను గూర్చి ఆలోచించినవాడైయున్నాడు, కానీ మొదట ఆయన హృదయమును గూర్చి అనగా - దాని వైఖరి, దాని ఉద్దేశములు మరియు అభిప్రాయాలను గూర్చి ఆలోచించినవాడైయున్నాడు. ప్రారంభ సమయములో కొందరు సువార్త ప్రకటించుటకై తప్పుడు ఉద్దేశములను కలిగియుండిరి (ఫిలిప్పీయులకు 1:15-17). కొంతమంది పౌలు యొక్క బోధలలో తప్పు లేకపోయినప్పటికిని ఆయన ఉద్దేశములను ఆయన అక్కడయుండుటను మరియు ఆయన విడుదలను గూర్చి ప్రశ్నించుట ద్వారా ఆయనకు నష్టము కలుగజేయ ప్రయత్నించిరి (2 కొరింథీయులకు 10:10). యింకను, పౌలు తన సందేశము వినిన వారియొద్దనుండి మెప్పును గాని లేదా డబ్బునుగాని స్వీకరించుటకు ఆసక్తి కలిగియుండలేదని నిజాయితీగా చెప్పగలిగాడు (2:6, 9).

మన ఉద్దేశములను గూర్చి యితరులకు ఖచ్చితముగా తెలియకపోవచ్చును గాని దేవుడు సమస్తమును ఎరుగును. కాబట్టి, క్రైస్తవులుగా మన యొక్క వృద్ధిని లెక్కించుటలో ఒక ప్రాముఖ్యమైన భాగమేమనగా, ఉద్దేశములను పరీక్షించుటయే. యితరులు మనలను చాలా తేలికగా లేదా కఠినంగా తీర్పుతీర్చవచ్చు. కానీ దేవుడు ఎల్లప్పుడూ సరిగా నిర్ధారణ చేయును.

మనకు నచ్చినట్లు జీవించుటకైన కారణములను దేవుడెట్లు చూస్తున్నాడు? దేవుని అంచనా మన ఉద్దేశాలపై ఉంచుట చాలా కష్టమైనది. ఎందుకనగా మానవ అంచనాలు ఖచ్చితమైనవి కావు. మనలను ఎవరు విమర్శించకపోయినట్టయితే, సాధారణముగా మనము మంచి పనినే చేస్తున్నాము అనుకొంటాము. ఒకవేళ అనేకులు మనలను

విమర్శించినట్లయితే మనము ఎల్లప్పుడు అనారోగ్యముగా ఉందుము. కొంతమందికి విమర్శన అనేది అపజయముతో సమానమైనది. క్రైస్తవులముగా, దేవుడు మనలను మరియు మన ఉద్దేశములను ఎరుగునని తప్పక జ్ఞాపకముంచుకొనవలసినవారమై యున్నాము. దేవుడు మన ఆలోచనలను మరియు మన క్రియలను చూస్తున్నందుకు మనము తప్పక సంతోషముగా యుండవలసినవారమైయున్నాము.

పౌలు, సిల్వాను మరియు తిమోతియు థెస్సలొనీకాకు బయటయుండినవారినుండి అనేక విమర్శనలను ఎదుర్కొన్నారు. అదే విధముగా, వారు వారి యొక్క సహోదరుల యొద్దనుండి కూడ కొంత విమర్శనను ఎదుర్కొన్నారు. వారు ఎలా స్పందించారు? దేవుడు వారి యొక్క హృదయములను పరీక్షించుచున్నందుకు వారు ఎంతో సంతోషపడిరి. సువార్తను ప్రకటించుటకు దైవావేశముగల బోధకులుగా వారిని ఉపయోగించుకొనుటకై దేవుడు వారిని ఎంచుకొనుటయనేది వారి యొక్క స్వభావమునకు ఆయన అంగీకారమును తెలిపియున్నాడు. సువార్త విషయములో వారు ఏమి చేసిరో అది వారు నిజాయితిపరులని ప్రదర్శించినది. వారి ఉద్దేశములు మరియు జీవితములు ఏకరీతిగా ఉన్నాయి.

సువార్తయనేది చాలా విలువైన సందేశము, 2 కొరింథీయులకు 4:7లో అది “మంటి ఘటములలో ఐశ్వర్యముగా” వర్ణించబడింది. అదేవిధముగా అట్టి సందేశమును ప్రతిబింబించుచున్న క్రైస్తవ జీవితములు విలువైనవిగా పరిగణించబడినవి. మన చుట్టూ ఉన్న వారు మన క్రియలు చూస్తుండగా, దేవుడు మనము తెలివిగా లేదా వెర్రితనముగా నిర్ణయాలు తీసుకొను లేక ఎంచుకొను హృదయమును చూస్తున్నాడు. క్రియలనేవి మనకున్న తలాంతులను మరియు మనము పొందిన శిక్షణను చూపగలవు, కానీ హృదయము యొక్క స్వభావము అసలైన మనిషిని దేవునికి బయలుపరచుతుంది. దేవుడు సమూయేలుతో, “మనుష్యులు లక్ష్యపెట్టువాటిని యెహోవా లక్ష్యపెట్టడు; మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు, గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును” అని చెప్పాడు (1 సమూయేలు 16:7బి).

### క్రైస్తవులను లక్ష్యపెట్టుటయనేది మన బాధ్యత (2:4-11)

థెస్సలొనీకయాకు వచ్చిన ఉపదేశకుల గుణగణాలకు సాక్షులైన యిద్దరు ఎవరనగా, దేవుడు మరియు థెస్సలొనీకయా సంఘము. సువార్తను వారికి అప్పగించుట ద్వారా దేవుడు తన సమ్మతిని చూపించియున్నాడు (2:4). ఈ ఉపదేశకులను వారిని మొదటిగా దర్శించిన సమయములోనే థెస్సలొనీకయులు వారు ఎటువంటివారో తెలుసుకొనగలిగిరి (1:5).

### లక్ష్యపెట్టుటయందు యిచ్చకపు మాటలుండవు (5, 6 వచనాలు)

పౌలు, సిల్వాను మరియు తిమోతియు వారిని ముఖస్తుతిచేయుట ద్వారా వ్యక్తిగత మెప్పును పొందుటకై బోధించలేదు. అలాగే వారి ఆకలిని తీర్చుకొనుటకు లేదా కోరికలను తీర్చుకొనుటకై వారి యొద్దనుండి డబ్బు స్వీకరించుటకు ప్రయత్నించలేదు. దేవుడు మరియు థెస్సలొనీకయా క్రైస్తవులు యిట్టి విషయమును ఎరుగుదురు (2:5).

“వాక్చాతుర్యముతో గాని జ్ఞానాతిశయముతో గాని దేవుని మర్మమును వారికి ప్రకటించుటకు వచ్చిన వాడు కాదని” పౌలు కొరింథీనందున సహోదరులకు జ్ఞాపకము చేసాడు. ఆయన “బలహీనతలోను భయముతోను ఎంతో వణకుతోను” వారి యొద్ద ఉండటం

జరిగింది (1 కొరింథీయులకు 2:1, 3). తాను సందేశమును అందించే విధానము ద్వారా వినువారిని సంతోషపెట్టాలని కోరుకొనలేదు కానీ సందేశమును బట్టియే సంతోషపెట్టాలని కోరుకున్నాడు. అబద్ధమును అదేవిధముగా సత్యమును వృద్ధిచేయుటకు గొప్ప బోధ మరియు గొప్ప చాతుర్యము, మరియు మెచ్చుకొనే పద సముదాయమును మొదలగువాటిని ఉపయోగించవచ్చు. నిష్కపటమైన మరియు సరియైన దేవుని సందేశమే వినువారిని ప్రభావితం చేసిందనే విషయమును తెలుసుకోవాలని పౌలు కోరుకొన్నాడు.

పౌలు మరియు ఆయన జతపనివారు తమను గూర్చి ఎటువంటి చెడు అభిప్రాయమును కలిగించకుండునట్లు లేదా వారిని ఘనపరచుటకు ఎటువంటి కారణమును కల్పించక కేవలము సువార్తకు స్పందించునట్లు మాత్రమే వారు థెస్సలొనీకయులకు సత్యమును అందించారు (2:6). ప్రజలు “ఎంత గొప్ప ప్రసంగీకుడు!” లేదా “ఎంత గొప్ప ప్రదర్శన!” అని చెప్పకుండా, “ఎంత గొప్ప దేవుని సందేశం!” అని చెప్పునట్లు కోరుకొనవలసినవారమై యున్నాము.

పౌలు తన పనినిబట్టి ఘనతను గాని లేదా లాభమును గాని కోరుకొనియుండలేదు. అపొస్తలులవలే (అనగా ఒక ప్రత్యేక పనికొరకు ఎన్నికచేసుకొని “పంపబడినవారివలే”), పౌలు, సిల్వాను మరియు తిమోతియు దేవుని ఆజ్ఞలను యిచ్చుటకు సమర్థులైయున్నారు. ఒక చిన్న క్రైస్తవ పట్టణాన్ని ఈ ముగ్గురు వ్యక్తులు దర్శించుటయనేది ఒక జీవిత కాలపు సంఘటనయైయుండును. మనమైతే చాలా సంతోషించేవారము, వారు కూర్చొనుటకు ఒక ఉన్నతమైన స్థలము యిచ్చియుండేవారము, మరియు వారు అపొస్తలులని అందరికి బహిరంగముగా ప్రకటించేవారము. మరియు ప్రతి ఒక్కరు వారిని గౌరవించునట్లు అందరిని ప్రోత్సహించేవారము. కానీ అటువంటి వాటికొరకు వారు వచ్చియుండలేదని పౌలు చెప్పాడు.

పౌలు జీవితములోని అనేక కోణాలు ఎంతో మెచ్చుకొను విధముగాయున్నవి. ఆయన వాటిలో కొన్నింటిని ఫిలిప్పీయులకు 3:4–8లో నమోదు చేసియున్నాడు; కానీ ఆత్మీయ విలువల విషయములో పౌలు వాటినన్నింటిని “పెంటగా” ఎంచియున్నాడు! తాను చెప్పినవాటిని చేయునట్లు ఒప్పించుటయే అపొస్తలుడుగా తన కర్తవ్యం అని చెప్పియుండవచ్చు! ఏది ఏమైనప్పటికిని అపొస్తలుడు ఆజ్ఞాపించే హక్కును, అధికారమును కలిగియుండినప్పటికిని, నిజమైన అపొస్తలుని యొక్క పాత్ర సేవచేయుటయైయున్నదని పౌలు తరువాత కొన్ని వచనాలలో ప్రదర్శించాడు.

ఉపదేశకులు మరియు సువార్తికులు కొన్నిసార్లు తమ విద్యార్థుల యొద్దనుండి దేవుని సందేశమునకు స్పందన కోరుకొనక డబ్బును గాని లేదా వారి యొద్ద నుండి ఘనతను పొందులాగున బోధించుటకు లేదా పనిచేయులాగున శోధించబడతారు. సువార్తికుల జీవితములోని లక్షణాలు వారి చుట్టూ ఉన్నవారిని మెప్పించవచ్చు – అవి ఏవనగా – బహిరంగముగా మాట్లడగల సామర్థ్యము, తనకు అనేకులు షేక్‌హ్యాండ్ యిచ్చులాగున, ఒక ఆఫీసును కలిగియుండుట, తన యొక్క పేరు పత్రికలలో ముద్రించబడియుండుట మొదలగునవి. అయితే వీటన్నింటి యొక్క ఆత్మీయ విలువ “సున్నా.” ప్రజలను యేసుతో ప్రభావితులు అగులాగున చేయుట సువార్తికుల గురియైయుండాలి; యేసు యొక్క సందేశకుల స్థానమునకు కాదు. ప్రజలు మనకు కాక, రక్షకుడైన యేసు కొరకు ప్రతిస్పందించునట్లుగా

ప్రజలను ప్రోత్సహించవలసినవారమై యున్నాము!

మనము మన సొంత అధికారము, తలాంతు, లేదా మనము సాధించినవాటినిబట్టి ఘనత పొందునట్లుగా శోధించబడినట్టయితే మనము వెళ్ళి ఆ చెత్తకుప్పను బయట పడవేయవలసిన వారమైయున్నాము. మానసికంగా, మన "గొప్పతనమును" ఎవరికి చెందునో అక్కడ యుంచవలసినవారమైయున్నాము మరియు "అతిశయించువాడు **ప్రభువు**నందే అతిశయించవలెను అని వ్రాయబడినది" (1 కొరింథీయులకు 1:31) అని గుర్తుంచుకొనండి.

**లక్ష్యపెట్టుటయందు సాధుత్వము ఉండును (7, 8 వచనాలు)**

ఇతరులతో కలిసి పనిచేయుచున్నప్పుడు లేదా జీవించుచున్నప్పుడు క్రైస్తవులు ఎట్లుండవలసినవారైయున్నారు? పౌలు, సిల్వాను, మరియు తిమోతియు ఒక చిన్న బిడ్డకు తల్లివలెయుండిరి (2:7). ఎంత గొప్ప పాఠము నేర్చుకొనవచ్చునో! ఒక చిన్న బిడ్డకు ఇచ్చునటువంటి సమయము, వాని పట్ల చూపు శ్రద్ధ, మరియు ఆసక్తినంతటిని గూర్చి ఆలోచించండి. ఒక నడవలేని, మాట్లాడలేని, లేదా తనను తాను పోషించుకొనలేని నిస్సహాయుడైన చిన్న పిల్లవానికి తల్లి లేదా తండ్రి ఆయా నిరంతర సంరక్షణను యిచ్చును. తల్లి బిడ్డ యొక్క అతి సున్నితమైన కోమలమైన శరీర భాగములు నష్టపోకుండునట్లు ఎంతో దయతోను, సాధుత్వముతోను బిడ్డ యొక్క ప్రతి అవసరమును తీర్చును. దేవుడిచ్చిన జీవితము ఆ తల్లి చేతిలో ఉంటుంది! ఇది సువార్తికుని గూర్చి చెప్పినట్లుగా ఉందికదూ?

మన సువార్తికుల శిక్షణా కార్యక్రమము "పాముపలె వివేకులును పావురమువలె నిష్కపటులునై యుండుడి" (మత్తయి 10:16) వంటి ఉపదేశకులను శిక్షణనిచ్చు లక్ష్యాన్ని కలిగియుందా? నేనొక సువార్తికుల శిక్షణా పాఠశాలలో పని చేసాను. ఒకసారి ఒక సువార్తికుడు కొంతమంది పట్టాపుచ్చుకొనిన వారిని "సాధువైయుండవలెను." అది సువార్తికులకు ఒక ప్రత్యేకమైన అర్హతయని ప్రోత్సహించాడు (2 తిమోతి 2:25). అప్పటివరకు నేను దానిని గూర్చి అంత తీవ్రముగా ఎప్పుడూ ఆలోచించలేదు, కానీ సువార్తికులకు మరియు ఉపదేశకులకు, పెద్దలకు, పరిచారకులకు శిక్షణ యిచ్చుటలో అది మనకు ఒక లక్ష్యము వలెయుండవలెను. మనము బలము, అధికారము, ఆధిపత్యముచే మెప్పించబడుటకు శోధించబడినప్పుడు, మనము క్రీస్తు పని యొక్క వర్ణను గుర్తు చేసుకొనవలసినవారమై యున్నాం: "విజయమొందుటకు న్యాయవిధిని ప్రబలముచేయువరకు ఈయన నలిగిన రెల్లును విరువడు మకమకలాడుచున్న అవిసెనారను ఆర్పడు ..." (మత్తయి 12:20).

సందేశకుని మరియు సందేశమునకు మధ్య ఒక సన్నిహితమైన సంబంధమును దేవుడు కోరుకొంటున్నాడు. మనలో అనేకమంది అసంపూర్ణులని, దేవుని క్షమాపణ అవసరమైయున్నవారమని మనము ఒప్పుకుంటాము. ఏ విధముగానైతే దేవుడు తన సందేశములో పాపమును అసహ్యించుకొని నీతిని ఎత్తిపట్టుకొనుచున్నాడో అదే సందేశము దేవుడు మన జీవితములనుండి రావాలని కోరుకొనుచున్నాడు.

థెస్సలొనీకయలోని క్రైస్తవులను కుటుంబములోని యౌవ్వనులైన సభ్యులుగా పరిగణించినయెడల, క్రొత్తగా జన్మించిన "పిల్లలకు" పౌలు మరియు అతని జతపనివారు "తల్లిదండ్రులనే" బలమైన భావమును కలిగియున్నారనేది తార్కిక ఆలోచనయే. ఇట్టిది "పిచ్చి

ప్రేమగా” వర్ణించబడింది ఎందుకనగా వారు ఈ పనివారికి చాలా “ప్రియమైనవారు” (2:8). అదే విధముగా, విశ్వాసులైన వారితో నూతన క్రైస్తవుల సంబంధము “నిష్కపటమైన సహోదర ప్రేమగా” 1 పేతురు 1:22 వచనము వర్ణించినది. సహోదర ప్రేమ యొక్క ఈ వైఖరి ఈ పత్రికలో తరువాత భాగములో నొక్కి చెప్పబడింది (4:9, 10).

కుటుంబ స్నేహమనే వైఖరి నూతన క్రైస్తవుల వాతావరణములో భాగము కావాలని దేవుడు కోరుకొనుచున్నాడు. వారు ఒక కుటుంబములో భాగముగా ఒక సహోదరత్వము వలేయుండాలని ఆయన కోరుకొనుచున్నాడు. విరోధము, వేర్పాటువాదము, మరియు విగ్రహారాధనను తిరస్కరించినందుకు వారిని ద్వేషించినవారు మరియు వారి కుటుంబ సభ్యులనుండి వచ్చేటటువంటి హింస మొదలగువాటిని – సంభాళించులాగున ఒకే కుటుంబము అనే ఈ అనుభవము నూతన క్రైస్తవులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వారు దేవుని కుటుంబములో మరియు సమాజములో ఉండుటద్వారా వచ్చిన ఆనందమును, భద్రతను అనుభవించెదరు.

నూతన క్రైస్తవులలో కుటుంబమనే ఈ బలమైన భావనను బట్టి ఈ అపొస్తలులు వారి సువార్తను మరియు వారి జీవితములను పంచుకొనుటకు ఎంతో ఆత్రుత కలిగినవారైయున్నారు. అపొస్తలులు వారు సందేశము వినాలని మరియు ఆ పనిలో వారి సందేశ సారాంశము చూడాలని కోరుకున్నాడు, ఒకనికి ఏదైనా ఒక పాఠమును అందించుట మంచి ప్రయత్నముగా కనిపిస్తుంది, కానీ ఎవరికైనా మన జీవితమును యిచ్చుటయనేది గొప్ప త్యాగముగా కనిపిస్తుంది, దీనిని చేయుటకు యిష్టపడము. నేడు యితరులతో మనము వ్యవహరించే విధానములో మనము యిట్టి నియమాన్ని అమలు చేయవలెను. ఆత్మలను గూర్చి శ్రద్ధ కలిగియుండుటయనేది ఆత్మలను గూర్చి జాగ్రత్త వహించుటను కలిగియుంటుంది. జీవితములు అపాయములో ఉన్నాయి!

**లక్ష్యపెట్టుటయందు పని చేయుట ఉన్నది (9–11 వచనాలు)**

యితరులవలే సువార్తికులు మరియు ఉపదేశకులు కూడ సోమరులై యుండుటకు శోధించబడుదురు. సువార్త ప్రకటించుటకు యితర దేశములకు వెళ్ళుట అనేది కష్టముతోకూడిన పనియని 9వ వచనము తెలుపుతుంది – అవును అది నిజమే! ప్రత్యేకముగా యిట్టి పరిస్థితియే థెస్సలొనీకయకు వెళ్ళిన సువార్తికుల విషయంలో జరిగినది: ఈ సువార్తికులు యితరులకు సువార్తను బోధిస్తూ తమకు తాము ఆర్థిక సహాయమును చేసుకొనిరి, వాస్తవానికి వారు రెండు పనులను కలిగియుండిరి.

సువార్త ప్రకటించుచున్న సువార్తికులకు ఆర్థిక సహాయము అందించుటయనేది దేవునిచే అంగీకరించబడినది అని పౌలు అర్థము చేసుకొన్నాడు. అటువంటి సువార్తికులు సహాయమును పొందే అర్హతను కలిగియున్నారని పౌలు కొరింథీ సంఘమునకు చెప్పాడు (1 కొరింథీయులకు 9:6, 7), మరియు ఫిలిప్పీ సంఘమునుండి మరలా మరలా వచ్చిన సహాయమునుబట్టి పౌలు వారి విషయంలో ఎంతో కృతజ్ఞుడైయున్నాడు (ఫిలిప్పీయులకు 4:15, 16). అటువంటి సహాయము ద్వారా, యిచ్చువారు మరియు తాను ఆశీర్వాదించబడి యున్నారని పౌలు చెప్పుకొన్నాడు (ఫిలిప్పీయులకు 4:17).

అదే సమయములో, సువార్తికులు సహాయము కొరకు సంఘమును ఒత్తిడి

చేయకూడదు. ఈ థెస్సలొనీకయులు యితర సమస్యలతో బాధపడుచుండగా అపొస్తలులు మరలా వారిపై వీరికి సహాయము చేయుటయనే అదనపు భారమును ఉంచదలచుకొనలేదు. ఈ సువార్తికులు క్రైస్తవులైన వీరికి ప్రోత్సాహమును అందించుటకు తమ జీవితములను యిచ్చివేసిన విధానములో యిది ఒకటి.

చాలా స్పష్టముగా చూసినట్టయితే, సువార్తికులు సహాయమును పొందే అర్హతను కలిగియున్నారని క్రైస్తవులు తప్పక అంగీకరించవలసినవారైయున్నారు. ఉపదేశకులు కూడ సువార్తికులు కూడ వారికి సహాయము లభిస్తున్నా, లభించకపోయినా సువార్త ప్రకటించుటలో కష్టపడి పనిచేసేవారుగా ఉండుటకు నేర్చుకొనవలసినవారైయున్నారు.

చాలా ఉద్యోగాలకు శిక్షణ, నైపుణ్యము మరియు సామర్థ్యాలు కావాలి. కానీ నిజాయితీ, నీతి, శ్రద్ధ మరియు సహనములు ఒక ఉద్యోగానికి అర్హతలుగా ఉండుట ఎన్నిసార్లు చూసావు? తప్పకుండా ఈ లక్షణాలు లేదా అర్హతలనేవి జీవితములోని దైవిక పాత్రను మరింత ప్రభావితముగా చేస్తాయి. ఎంత తరచుగా మనము దూరదృష్టి కలిగిన సువార్తికుల, ఉపదేశకుల మరియు పెద్దల జీవితములలో ఈ లక్షణాలను పరీక్షించాము? కొన్ని సంఘాలు 2:10లోని: "... ఎంత *భక్తిగాను, నీతి గాను, అనింద్యముగాను ప్రవర్తించితిమో దానికి మీరు సాక్షులు.*" (నొక్కి చెప్పింది నాది.) అనే బైబిల్ పరమైన మాదిరులను నిర్లక్ష్యము చేసి వారి యొక్క చదువు, వ్యక్తిత్వము మరియు వారి పని, వారి వ్యాపారములలో విజయమును పొందుట మాత్రమే చూచుచున్నారు. వాటి మధ్య వ్యత్యాసమును పోల్చుటలో యిబ్బందికరమైన పరిస్థితి యుండులాగున 10వ వచనము ఒకే విధముగా యుండునటువంటి మూడు పదాలను ఉపయోగించుచున్నది. అటువంటి పదాలు థెస్సలొనీకయా పత్రికలో అనేక చోట్ల ఉపయోగించబడిన వాటి అర్థము మూడు వేరువేరు ఆలోచనలను వ్యక్తపరచుట కాదు కానీ ఒకదానికొకటి బలమును చేకూర్చుకొనుటకును మరియు ఒక ముఖ్యమైన లక్షణమును ఎత్తిచూపుటకు మాత్రమే ఉపయోగించబడింది.

ఉపదేశకులు ఒక ఉన్నతమైన ప్రామాణిక ప్రవర్తనను కొనసాగించుటయనేది చాలా ముఖ్యమైనది. వారు చేసిన ఏ పనియైనను దేవుని నిర్ణయము చొప్పున అది వారికి సాధ్యమైంది. అనగా వారు ఎప్పుడు తప్పుడు నిర్ణయములను చేయలేదని కాదు లేక పాపము చేయలేదని దీని అర్థము కాదు. అయితే, వారు దేవుని ప్రమాణికతను వారి పనులకు అన్వయించుకొనిరి, దానినిబట్టి చెడ్డదైనా లేదా మంచిదైనా, ఏ పరిస్థితిలోనైన వారు దేవుని మార్గములో దేవుని లక్ష్యాలను సాధించుటను సూచిస్తుంది. ఆ సువార్తికులు థెస్సలొనీకయాను విడిచి వెళ్ళినప్పుడు, "అయ్యో వారు ఈ సమస్యను గూర్చి మాట్లాడుటలేదు; అయ్యో యిక్కడ వారు పశ్చాత్తాపము పొందని కొన్ని పాపములు కలవు" అని థెస్సలొనీకయులు చెప్పలేకపోయిరి. వారు సాధించిన కీర్తికి మరియు పేరు ప్రతిష్టలకు ప్రతిగా వారి పై ఎవరూ సరియైన నిందను మోపలేరు.

ఉపదేశకుల ప్రవర్తనకు సంబంధించి 11వ వచనము మరొకసారి మూడు పదములను ఉపయోగించుచున్నది: "... మీలో ప్రతివానిని *హెచ్చరించుచు, ధైర్యపరచుచు, సాక్ష్యమిచ్చుచు,* తండ్రి తన బిడ్డల యెడల నడుచుకొనురీతిగా మీలో ప్రతివానియెడల మేము నడుచుకొంటిమని మీకు తెలియును." (నొక్కి చెప్పింది నాది.) మరలా ఈ వచనము యొక్క సందేశమును అర్థము చేసుకొనులాగున ప్రతి పదము యొక్క విస్తారమైన వివరణను కలిగియుండుట అనేది అనవసరము. ఈ పదాలనేవి ఒకదానికొకటి బలమును చేకూర్చుకొనుచు మరియు

సందేశమును నొక్కి చెప్పుచున్నాయి!

పిల్లల అభివృద్ధికొరకు తండ్రి వారిని నిరుత్సాహపరచుట మాని లేక నిందించట మాని, సమస్త విధమైన సూచనలను, ప్రోత్సాహమును హెచ్చరికలను యిచ్చును. ఈ ప్రక్రియను ఎఫెసీయులకు 6:4 వర్ణిస్తున్నది: "తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి." పిల్లలను సరియైన మార్గములో పెంచుటకు తల్లిదండ్రులు తమ జీవితములను హెచ్చించుట ఎంత సరియైనదో, అలాగే సరిగా ఉపదేశించుటలో కూడ సువార్తికుడు తన జీవితమును మాదిరిగా అర్పించడం ఉండును.

అదేవిధముగా, విద్యార్థి పరిణితి చెందుటకు సహాయపడులాగున ఉపాధ్యాయుడు హెచ్చరికలకు సంబంధించిన ప్రోత్సాహకరమైన సాధకములను ఉపయోగించవలసినవాడైయున్నాడు. వాస్తవానికి, క్రైస్తవులందరు త్యాగముచేసి మరియు ఓపికతో వారి సంబంధాల మధ్య ఒకరికొకరు బోధించుకొనవలసినవారై ఉన్నారు. యిట్టి విషయం 5:11లో ఎత్తి చూపబడినది: "... యొకనినొకడు ఆదరించి యొకనినొకడు క్షేమాభివృద్ధి కలుగజేయుడి, ..." దేవుడు తన ప్రజల యొక్క క్షేమమును కోరుకున్న ప్రకారము పాటుపడువారముగా, ఓపికగా, నిందారహితమైన పనివారముగాయుందము రండి! మనము ప్రేమించు తండ్రులవలె మరియు జాగ్రత్తగల తల్లులవలే శ్రద్ధగలిగి ఆదరించు తల్లిదండ్రులవలే వ్యవహరించవలసినవారమైయున్నాము!

### దేవునిని మహిమపరచుటయే మన లక్ష్యము (2:12)

క్రైస్తవుల జీవితమనేది క్రీస్తును ప్రతిబింబింపచేయవలెను. దైవ భక్తిగల జీవితమనేది దేవునిని రుజువుచేస్తూ ఆయనను ప్రదర్శించవలెను. క్రొత్త నిబంధన తరచూ "యోగ్యులైయుండుట" అనే ఆలోచనను వ్యక్తపరుస్తుంది. ఉదాహరణకు 2:12లో, "మిమ్మును పిలుచుచున్న దేవునికి తగినట్టుగా మీరు నడుచుకొనవలెనని" క్రైస్తవులకు విజ్ఞప్తిచేయబడింది. దీని అర్థమేమి? దేవుడు తమ జీవితములను ప్రభావితము చేశాడని చూపుటకు థెస్సలొనీకయులు ప్రోత్సహించబడ్డారు. దేవుడు ఎలా యుంటాడో, మరియు ఆయన ప్రజలను ఎట్లు జీవించాలని కోరుకుంటాడో ప్రదర్శించబడులాగున క్రైస్తవులు వ్యవహరించవలసినవారైయున్నారు.

దేవుడు ఎటువంటివాడో మరియు దేవుడేమి కోరుకొనుచున్నాడో నేర్చుకొనుటయనే ఈ ప్రక్రియ క్రైస్తవులముగా మనలో ప్రతి ఒక్కరు పరిణితి చెందుటలో భాగము. క్రొత్తగా మార్పు చెందినవారు దేవుని గూర్చి అంతయూ తెలుసుకోవాలని ఎదురు చూచుటలేదు మరియు వారి జీవితములకు ఆయన సంకల్పమును గూర్చి తెలుసుకొనునట్లు కోరబడలేదు. కానీ "ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని ..." తెలుసుకొనవలనని (ఎఫెసీయులకు 5:10) కోరబడ్డారు. ఈ నియమమును నేర్చుకొనుచూ మరియు అన్వయించుటయనేది క్రైస్తవ వృద్ధికి ఆధారమైనది.

మనము దేవుని రాజ్యమును మరియు మహిమను పంచుకొనుటకు యోగ్యులమని 12వ వచనము చెప్పుట లేదు. అది మనము ఎన్నడును సంపాదించలేని ఒక బహుమానం. భక్తిగల జీవితమును జీవించుటయే మన ఉద్దేశమై ఉండాలని అది బోధిస్తున్నది, అదియే గొప్ప ఉద్దేశం. మనలోని ప్రతి ఒక్కరితో తన రాజ్యమును మరియు మహిమను సంతోషముగా

పంచుకొనిన ఔదార్యముగల దేవునికి ఎంతో కృతజ్ఞులమైయుందుము దాని విషయమై మనము ఉత్తేజపరచబడుదుము! ఆయన స్వభావమును ప్రతిబింబించు విధానములో జీవించుట ద్వారా మనము ప్రతిస్పందించవలసినదిగా ఆయన కోరుకొనుచున్నాడు. ప్రజలు మనలో దేవునిని చూస్తున్నారా?

## ముగింపు

ప్రతి బోధకుడు ఈ వచనాలలోని పాఠములను నేర్చుకొనినట్టయితే అది ఎంతో గొప్ప మార్పుతేగలదు! మనము బోధించే ముందు మనము బోధించుదానిని సాధనచేయులాగున మనందరికి ఇది ఎంత కదలికగాయుండును! దేవుడు మనలను కోరుకొనినట్టుగా జీవించుచున్న మన సొంత జీవితమునుండి మనము మాదిరులను యివ్వగల సమర్థులమైతే ఏమి జరుగును? తల్లిదండ్రులు తమ పిల్లలను పాటించమని చెప్పిన నియమాలను తల్లిదండ్రులు ఎంతో జాగ్రత్తగా తమ జీవితాలలో ప్రదర్శించి మరియు రుజువు చేయగలిగినట్టయితే ప్రతి కుటుంబము ఎంత గొప్ప మార్పుపొందగలదో! పెద్దలకు గాని లేదా పిల్లలకు గాని, కుటుంబములోగాని లేదా సంఘములోగాని బోధకులుగాయున్న ప్రతివారు దేవునియొక్క సందేశమును పంచుకొనుటలో ఆసక్తిగలవారైయుండి మరియు తమ జీవితములను యితరులతో పంచుకొనుట ద్వారా కూడ అట్టి సందేశమునకు బలము చేకూర్చునట్టయితే అనేక సంఘములకు మరియు కుటుంబములకును అది ఎంత గొప్ప మార్పుగా ఉండును! ప్రతి క్రైస్తవుడు తన సోదరి మరియు సహోదరులు ఏది చేయాలని ఆలోచిస్తారో దానిని మొదట ప్రదర్శించినట్టయితే ప్రతి క్రైస్తవునికి ఇది ఎంత ఆనందకరమైన మార్పుకాగలదు!

మన జీవితములతో యితరులను సేవించుటయనేది క్రైస్తవులకు యివ్వబడిన ఒక గొప్ప పాత్ర. యితరులు దేవుని జీవితమును పంచుకొనులాగున మనము దేవుని వాక్యమును మరియు మన జీవితమును పంచుకొనినప్పుడు మన బోధ మరింత ప్రభావముగాను మరియు మన జీవితము మరింత ప్రయోజనకరముగా యుండును! మన నాయకుడైన యేసును అనుసరించుటకు – నిశ్చయించుకొందుము. ఆయనను అనుసరించినవారి మాదిరులను అనుసరించుటకు నిశ్చయించుకొనుము. వారి జీవితములతోను మరియు వారి పాఠములతోను తోటి క్రైస్తవులకు సహాయపడుచున్న మన ఉపదేశకులను మరియు యితర నాయకులను ప్రోత్సహించుటకు నిశ్చయించుకొనుము. ఎవని జీవితమైతే యేసును అనుసరించుటకు యితరులకు సహాయపడునో అలాంటి వ్యక్తిగా యుండుటకు నిశ్చయించుకొనుము.